సాక్షి విశాఖపట్నం

గురువారం। 18। జనవరి। 2024



4,305 మందికి సేవలు

12 ప్రాంతాల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 4,305 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 10లో



ప్రమాదాలపై పారాహుషార్!

ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాల నివారణపై ఫోకస్ పెట్టారు. ఎక్కువ ప్రమాదాలు ఏ డిపోలో, ఏ డ్రైవర్లు చేస్తున్నారో తెలుసుకుంటున్నారు. 10లో

77 ఏళ్ల జ్ఞానాన్వేషి



ఎస్‌బీఐ ఏయూ శాఖలో పనిచేసిన సందర్భంలో ఇక్కడ ఆచార్యులతో మాట్లాడటం, వారితో వివిధ అంశాలపై చర్చించడంతో ఆనందరావులో కొత్త ఆలోచనలకు బీజం పడింది. 10లో

న్యూస్‌రీల్

నలుగురు కార్పొరేటర్ల సస్పెన్షన్

సీతంపేట: విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన నలుగురు కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ 29వ వార్డు కార్పొరేటర్ ఊరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ జైన్ కుమార్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌లను సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫార్సు మేరకు పార్టీ అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

26 నుంచి కౌంటర్ల ద్వారా టెస్ట్ మ్యాచ్ టికెట్ల విక్రయం



విశాఖ స్పోర్ట్స్: భారత్– ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌కు కౌంటర్ల ద్వారా టికెట్లను ఈనెల 26 నుంచి విక్రయించనున్నారు. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు ఈ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే పేటీఎం ఇన్‌సైడర్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం కొనసాగుతుండగా ఆఫ్‌లైన్ ద్వారానూ టికెట్లను వైఎస్సార్ స్టేడియంతో పాటు స్వర్ణభారతి స్టేడియంలోనూ విక్రయించడానికి ఏర్పాట్లు చేశామని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి తెలిపారు. కౌంటర్ల ద్వారా రోజుకు 4,632 టికెట్లను, ఆన్‌లైన్‌లో రోజుకు 5,900 టికెట్లను విక్రయిస్తున్నారన్నారు. మ్యాచ్ జరిగే ఐదు రోజులకు సీజన్ టికెట్‌గా ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. టికెట్ల ధరలు ఒక్క రోజుకు రూ.100, రూ.200, రూ.300, రూ.500 చొప్పున, ఐదు రోజులకు రూ.400, రూ.800, రూ.1000, రూ.1500 చొప్పున విక్రయించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు సీజన్ టికెట్ రూ.250 చొప్పున రాయితీపై 2,850 టికెట్లను ఇవ్వనుండగా.. విద్యార్థులు వారి ఐడెంటిటీ కార్డు చూపించి ఉచితంగానే ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రతీ రోజూ రెండు వేల మందికి మొత్తంగా ఐదు రోజులకు పది వేల మంది విద్యార్థులకు ఉచితం ప్రవేశం కల్పిస్తామన్నారు.

బావికొండపై బౌద్ధ వందనం



బావి కొండపై బౌద్ధ వందనం చేస్తున్న బౌద్ధ భిక్షువులు

కొమ్మాది: జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య, మహా బౌద్ధ సొసైటీ ఆధ్వర్యంలో తిమ్మాపురం బావికొండ వద్ద బుధవారం బౌద్ధ వందనం జరిగింది. బౌద్ధ భిక్షువులు మహా స్థూపానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. బౌద్ధ భిక్షువు జ్ఞానదీప్ బాంతితో పాటు పలువురు బౌద్ధ భిక్షువులు, సొసైటీ వ్యవస్థాపకులు బోర వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు ఇస్కాన్‌కు స్వామీజీల రాక

కొమ్మాది: ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని ప్రబోధిస్తున్న అమెరికాకు చెందిన వేద వ్యాస ప్రియ స్వామి మహారాజ్, జయద్వైత స్వామి మహారాజ్‌లు గురువారం బీచ్‌రోడ్డులోని ఇస్కాన్ మందిరానికి చేరుకోనున్నారు. ఇస్కాన్ మందిరంలో గురువారం నుంచి ఆదివారం వరకు.. సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు స్వామీజీల ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని సాంబాదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో కోరారు.

67 బస్సులపై కేసులు

గోపాలపట్నం: సంక్రాంతి పండగ సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తూ రాకపోకలు సాగించిన 67 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం జరిపిన ప్రత్యేక తనిఖీల్లో ఐదు బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెల 13 నుంచి బుధవారం చేపట్టిన తనిఖీల్లో మొత్తంగా 67 బస్సులపై వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు హరిప్రసాద్, ప్రవీణ్ కుమార్, మన్మోహన్, లలిత పాల్గొన్నారు.

విమానయానం రయ్‌రయ్

- విమాన ప్రయాణికుల వృద్ధి పైపైకి..
- 2023–24లో 21,67,660 మంది రాకపోకలు



ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల సందడి

సాక్షి, విశాఖపట్నం: విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రాకపోకల్లో గణనీయమైన వృద్ధి నమోదు చేసుకుంటోంది. 2022–23తో పోలిస్తే 2023–24లో ఏకంగా 22 శాతం వృద్ధి సాధించింది. ఓవైపు రన్‌వే పునరుద్ధరణ పనుల వల్ల నవంబర్ నుంచి రాత్రి పూట సర్వీసులు నిలుపుదల చేసినా.. చివరి రెండు నెలల్లోనూ మంచి ఫలితాలే నమోదయ్యాయి. రాత్రి పూట కూడా సర్వీసులుండుంటే వృద్ధి శాతం 25కి దాటే అవకాశం ఉండేదని విమానాశ్రయ వర్గాలు చెబుతున్నాయి. కోవిడ్‌కు ముందు ఏడాది 30 లక్షల వరకూ ప్రయాణికుల రాకపోకలు సాగగా.. కోవిడ్ తర్వాత ఈ సంఖ్య సగానికి పడిపోయింది. అయితే.. క్రమంగా కోలుకుంటూ 2023లో తొలిసారిగా 20 లక్షల బెంచ్ మార్క్‌ను దాటింది. 2022–23 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ 17,67,609 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా.. 2023–24 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ 21,67,660 మంది రాకపోకలు సాగించారు. మరోవైపు.. ఈ ఏడాది విశాఖ ఎయిర్‌పోర్టుకు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కటే ఉన్న అంతర్జాతీయ సర్వీసు ఏప్రిల్ నాటికి మూడు సర్వీసులు రానున్నాయి. రోజుకు సగటున 50 విమానాల రాకపోకలు సాగిస్తుండగా.. రన్‌వే పనులు పూర్తయ్యాక వీటి సంఖ్య కూడా 70కి చేరుకునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

రోజుకు 50 విమానాల రాకపోకలు

1981లో రోజుకు ఒక విమానం ద్వారా పౌర సేవలు ప్రారంభమయ్యాయి. సివిల్ ఎయిర్ క్రాఫ్ట్‌లకు 85 రన్ వే కెపాసిటీగా విధించారు. జెట్ ఎయిర్‌వేస్ ఉన్నప్పుడు 80 విమానాలు రాకపోకలు సాగించాయి. జెట్ ఎయిర్‌వేస్ సర్వీసులు గతంలో నిలిచిపోవడంతో ప్రస్తుతం 60 నుంచి 66 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రతి పదేళ్లకోసారి రన్‌వే పునరుద్ధరణ పనులు చేపడుతుంటారు. ఈ పనుల కారణంగా నవంబర్ 15 నుంచి రాత్రి పూట సర్వీసులు నిలిపేశారు. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేస్తున్నారు. ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, పూణె తదితర ప్రాంతాలకు 12కి పైగా సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ప్రస్తుతం 50 వరకూ విమానాల రాకపోకలు సాగుతున్నాయి. ఇందులో ఒక అంతర్జాతీయ సర్వీసు కూడా ఉండటం విశేషం. అయినప్పటికీ.. పాసింజర్ ఫుట్‌ఫాల్‌లో మాత్రం 2023లో మంచి ఫలితాలు నమోదు చేసింది. ప్రతి రోజూ సగటున 7,000 నుంచి 7,500 వరకూ ప్రయాణికులు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

సర్వీసులు పెరిగే అవకాశాలు

ఈ ఏడాది మార్చి 31 నాటికి రన్‌వే రీ సర్ఫేసింగ్ పనులు పూర్తి కానున్నాయి. అనంతరం.. పాత సర్వీసులు పునరుద్ధరించేందుకు విమానయాన సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. వీటితో పాటు దేశంలోని వివిధ నగరాలకు కొత్త సర్వీసులు మొదలు పెట్టేందుకు ఇండిగో, ఎయిర్‌ఏసియా సంస్థలు ఎయిర్‌పోర్టు వర్గాలతో చర్చలు జరుపుతున్నాయి. టైమ్ స్లాట్స్‌ని అడ్జెస్ట్ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. వీటికి తోడు.. ప్రస్తుతం సింగపూర్‌కు మాత్రమే ఇంటర్నేషనల్ సర్వీసు నడుస్తోంది. మరో రెండు మూడు నెలల్లో అదనంగా రెండు సర్వీసులు మొదలవ్వనున్నాయి. ఏప్రిల్ నుంచి థాయ్‌లాండ్, మలేసియాకు డైరెక్ట్ సర్వీసుల్ని విశాఖ నుంచి నడపనున్నట్లు ఎయిర్‌ఏసియా సంస్థ ప్రకటించింది. ఇలా.. రీ సర్ఫేసింగ్ పనులు పూర్తయిన తర్వాత.. విమాన సర్వీసులు 70కి చేరే అవకాశాలున్నాయని విమానాశ్రయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రయాణికుల రాకపోకలు

నెల	2022	2023
ఏప్రిల్	1,94,969	2,57,640
మే	1,95,231	2,96,629
జూన్	2,04,200	2,54,490
జూలై	1,80,525	2,28,897
ఆగస్ట్	1,98,532	2,36,701
సెప్టెంబర్	1,73,332	2,24,117
అక్టోబర్	1,94,103	2,37,179
నవంబర్	1,80,373	2,11,378
డిసెంబర్	2,46,344	2,20,629
మొత్తం	17,67,609	21,67,660

ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి

- మరోమారు అవకాశం కల్పించిన ప్రభుత్వం
- ఆయన హయాంలో వర్సిటీ అభివృద్ధి



వీసీ ప్రసాద రెడ్డిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి రెండో పర్యాయం నియమితులయ్యారు. ఆయన విజన్‌ను గుర్తించి మరో పర్యాయం ఉపకులపతిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆచార్య ప్రసాదరెడ్డి తన దార్శనికతతో వర్సిటీ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలు, ప్రైవేట్ ప్రొఫెసర్‌లు, వైవిధ్యమైన నూతన ప్రాజెక్టులతో ఏయూకు నూతన జవసత్వాలను అందించారు. నాక్ డబుల్ ప్లస్, 3.74 సీజీపీఏ స్కోర్ సాధించడం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. జాతీయ స్థాయిలో మొదటి మూడు అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను నిలిపారు.

నవ్య ప్రగతికి సారథి

దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను నిలపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆకాంక్షను సాకారం చేసేందుకు ఆచార్య ప్రసాదరెడ్డి వినూత్న ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేశారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు నెలకొల్పడం, పరిపాలన భవనం, హాస్టళ్లు, గ్రంథాలయం ఆధునీకీకరణ, పోలమాంబ ఆలయానికి అనుకుని ఉన్న దాదాపు రూ.400 కోట్ల విలువైన స్థలం స్వాధీనం, రూసా నిధులతో చేపట్టిన నిర్మాణాలు, సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా ఆర్ట్స్, న్యాయ కళాశాలల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఇలా ఆయన తీసుకున్న నిర్ణయాలు అత్యుత్తమ ఫలితాలనిచ్చాయి. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని 84.5 లక్షల వార్షిక వేతనంతో ప్లేస్‌మెంట్ సాధించడం ఆయన హయాంలో గొప్ప విజయం. విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా ఆయన నాలుగేళ్ల పాటు శ్రమించారు. కంప్యూటర్ సైన్స్ ఆచార్యుడిగా లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన అనుభవం ఆయనది.

2008 నుంచి 2011 వరకు రిజిస్ట్రార్‌గా, 2011 నుంచి 2012 వరకు రెక్టార్‌గా, 2019 నుంచి వర్సిటీ వీసీగా బాధ్యతలను నిర్వర్తించారు. 2023 నవంబర్ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. ఆచార్య ప్రసాదరెడ్డి సమర్థత, దార్శనికతను గుర్తించిన గవర్నర్ మరో పర్యాయం ఆయన్ని వీసీగా నియమించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు ఆచార్య ప్రసాదరెడ్డి సారథ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, జి.శశిభూషణ రావు, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్‌కు గొప్ప గౌరవం

- 19న 206 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ
- విజయవాడ తరలిరావాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పిలుపు

మహారాణిపేట: బడుగు వర్గాల ఆశాజ్యోతి, ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను మనసావాచా నమ్మి, తూ.చ.తప్పకుండా ఆచరణలో చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గతంలో చంద్రబాబు అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తానని చెప్పి మోసం చేశారని ఓ ప్రకటనలో గుర్తు చేశారు. ఈ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.400 కోట్లకు పైగా వ్యయంతో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ 19.4 ఎకరాల్లో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. చరిత్రలో ఎవరూ అంబేడ్కర్‌కు ఇంత గొప్ప గౌరవం, విలువ ఇవ్వలేదన్నారు. అంబేడ్కర్ చరిత్ర, గొప్పతనం, స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. 206 అడుగుల విగ్రహ ప్రారంభం మనందరికీ పండగ రోజన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలందరూ భారీగా పాల్గొని.. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

మహారాణిపేట: విజయవాడ స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలోని 19.4 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 206 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ధ్యాన మందిరం, 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం, పచ్చదనం, ఫౌంటైన్స్ తదితర వసతులతో చారిత్రాత్మకంగా రూపొందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని, విజయవంతం చేసేందుకు చాలా శ్రమిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమమని, లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మిలాన్–24 వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండు ఫేజ్‌లుగా మిలాన్ కార్యక్రమాలు
- నేవీ అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ మల్లికార్జున
- హాజరుకానున్న ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



మిలాన్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా నిర్వహించనున్న మిలాన్–2024 వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్ పోర్టు, పోర్ట్ అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో భాగంగా మిలాన్–2024 ఇన్‌ఛార్జి, నేవల్ కమోడో సిరజ్ అజాద్ 12వ ఎడిషన్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్–2024 కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ విదేశాల నుంచి అతిథులు విచ్చేస్తున్నారని వివరించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మిలాన్ వేడుకల్లో 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధ నౌకలు, సబ్ మెరైన్లు భాగస్వామ్యం కానున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 18, 19వ తేదీల్లో దేశ, విదేశాల నుంచి నౌకలు విశాఖ పోర్టు, నేవల్ డాక్ యార్డుకు చేరుకుంటాయని చెప్పారు. 19వ తేదీన విదేశీ ప్రముఖులు నగరానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయని వివరించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేతుల మీదుగా నేవల్ బేస్‌లో అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్ ప్రారంభోత్సవం కూడా ఉంటుందన్నారు. 22వ తేదీన ఉప రాష్ట్రపతి నేవల్ ఆడిటోరియం సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారని వెల్లడించారు.

విజయవంతం చేయండి

కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ మిలాన్–2024 వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ ఏరియాలో బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని, తాగునీరు, బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు వేడుకలు జరిగే ప్రాంతాల్లో పర్యటించాలని, సీసీ టీవీ కెమెరాలు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఏపీఐఐసీ, ఏయూ గ్రౌండ్స్‌లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుందరీకరణ పనులు చేపట్టాలని, విశ్వప్రియ ఫంక్షన్ హాల్, విశాఖ మ్యూజియంలో కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో సముద్రంలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా మత్స్యకారులకు ముందుగానే సమాచారం అందించాలని మత్స్యశాఖ జేడీకి సూచించారు. డ్రోన్లు, గాలిపటాలు ఎగరవేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్‌లో శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అతిథులను ఆకర్షించేలా నిర్వహించాలన్నారు. సమావేశంలో కమోడో రాజ్‌నీష్ శర్మ, పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, డీసీపీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, వీఎంఆర్డీఏ సెక్రటరీ దాట్ల కీర్తి, జీవీఎంసీ ఈఈ, మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహ్మద్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతిభ అంచనా.. నిత్య సాధన

- ఇంటర్‌లో మెరుగైన ఫలితాలే లక్ష్యం
- 50 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు
- కాలేజీల్లో ప్రతి రోజూ ఒక పరీక్ష
- శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఫోకస్



గోపాలపట్నం ప్లస్–2 స్కూల్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు



డాక్టర్ వీ.ఎస్.కృష్ణా కాలేజీలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 'జయీభవ' పేరిట 50 రోజులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా అధికారులు ఫోకస్ పెట్టారు. కాలేజీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులంతా పరీక్షకు ఫీజు చెల్లించేలా ఈసారి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పరీక్షల నిర్వహణకు అనువైన కేంద్రాల గుర్తింపు ఇప్పటికే పూర్తయినందున.. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేలా అధికారులు దృష్టి సారించారు.

ప్రతిరోజూ పరీక్ష : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహించేలా ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించారు. సంక్రాంతి సెలవులు అనంతరం గురువారం నుంచి జిల్లాలోని జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షలకు ఇంకో 42 రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో 50 రోజుల ప్రణాళికలో భాగంగా కాలేజీల్లో ప్రత్యేక తరగతులతో పాటు.. ప్రతి రోజూ పరీక్ష నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్దిష్టమైన టైం టేబుల్ ప్రకటించారు. దీనిని పక్కాగా అమలు చేసేలా కాలేజీల ప్రిన్సిపాళ్లకు బాధ్యతలు అప్పగించారు.

జిల్లాలో 25 ప్రభుత్వ యాజమాన్య కాలేజీలు

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో జిల్లాలో 25 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కాలేజీలు 10, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 3, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 1, బీసీ వెల్ఫేర్–1, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు–3, హైస్కూల్ ప్లస్–6, ఎయిడెడ్–1 ఉంది. వీటి పరిధిలో 2023–24 విద్యా సంవత్సరంకు మొదటి సంవత్సరం 3,786 మంది, రెండో సంవత్సరం 3,194 మంది పరీక్షలకు హాజరవుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

జూనియర్ కాలేజీల్లో నాణ్యమైన చదువులు సాగేలా అవసరమైన మౌలిక వనరులను ప్రభుత్వం సమకూరుస్తోంది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జూనియర్ కాలేజీలను సైతం అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కార్పొరేట్‌కు దీటుగా నిలపాలంటే, మౌలిక వసతులతో పాటు, పరీక్ష ఫలితాలను సైతం ప్రామాణికంగా తీసుకునే పరిస్థితులు ఉన్నాయి. అందుకనే ప్రభుత్వ కాలేజీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలే పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకెళ్తున్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రతి రోజూ కళాశాలల వారీగా సమీక్ష చేస్తున్నాం. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జయీభవ'తో విద్యార్థులంతా విజయం సాధించేలా కాలేజీల ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి. ఉత్తీర్ణతలో జిల్లాను అగ్రభాగాన నిలుపేలా అంతా సమన్వయంతో పనిచేస్తాం.

–బి.రాధ, డీవీఈవో, విశాఖపట్నం

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ



వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. ప్రతి విద్యార్థీ ఎలా చదువుతున్నారనేది గమనించేలా సబ్జెక్ట్ టీచర్లకు బాధ్యత అప్పగించాం. సబ్జెక్టుల వారీగా ప్రతిరోజూ పరీక్ష నిర్వహించి, వాటిలో విద్యార్థుల సాధించిన మార్కుల ఆధారంగా, వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ పెడుతున్నాం.

– జె.విజయ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల కళాశాల, విశాఖపట్నం

మర్యాదపూర్వక కలయిక



బొత్స ఝాన్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: వైఎస్సార్ సీపీ విశాఖ లోక్‌సభ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు బుధవారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణతో విశాఖ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పలు విషయాలు చర్చించారు. పార్టీ నాయకులు జీవీ పాల్గొన్నారు.



విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మంత్రి బొత్సతో వాసుపల్లి భేటీ

అల్లిపురం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీ దంపతులను దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొత్స స్వగృహంలో బుధవారం వారిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. బొత్స ఝాన్సీని వైఎస్సార్ సీపీ విశాఖ లోక్‌సభ సమన్వయకర్తగా ప్రకటించిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ అంశాలపై మంత్రితో చర్చించారు.

లారీ కింద పడి హెల్త్ సూపర్‌వైజర్ దుర్మరణం

కొత్తవలస: విశాఖ–అరకు (516) జాతీయ రహదారిపై కొత్తవలస మండలంలోని తాడివానిపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎం.ఇందిరబాయ్(52) దుర్మరణం చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పీఎంఎల్ కాంప్లెక్స్ వెనుకవైపు నివాసముంటున్న ఎం.ఇందిరాబాయ్ విశాఖపట్నంలోని ప్రభుత్వ విక్టోరియా (గోశాల) హాస్పిటల్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. ఆమె తన స్కూటీపై విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా తాడివానిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ చక్రాల కిందికి వెళ్లిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆటగాళ్లకు క్రీడాస్ఫూర్తి అవసరం

• గ్రేహౌండ్స్ ఐజీ మీనా



విజేతకు ట్రోఫీ అందిస్తున్న ఐజీ మీనా

విశాఖ స్పోర్ట్స్: ఆటల్లో గెలుపోటముల్ని సమానంగా స్వీకరించాలని గ్రేహౌండ్స్ ఐజీ రాజీవ్‌కుమార్ మీనా అన్నారు. మార్వాడీ క్రికెట్ లీగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసిన ఆయన విజేతలకు ట్రోఫీలందించారు. రైల్వే స్టేడియంలో బుధవారంతో ముగిసిన ఈ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాల్ని అందించారు. ఆషాపూర జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలుత మహాకాళి జట్టు బ్యాటింగ్ చేసి 91 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా నిర్ణీత 15 ఓవర్లకు మరో ఐదు బంతులుండగానే ఆషాపూర జట్టు విజయం సాధించింది. మ్యాచ్ బెస్ట్‌గా దేవాషి నిలిచాడు. పూర్ణ వారియర్స్, జీసీసీ జట్లు సెమీస్‌లోనే వెనుతిరిగాయి. రాజేష్‌పగారియా పర్యవేక్షణలో ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో పదిజట్లు పోటీపడ్డాయి.

12 శిబిరాల్లో 4,305 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: విశాఖ అర్బన్‌లో బుధవారం 12 ప్రాంతాల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 4,305 మందికి పరీక్షలు నిర్వహించారు. భీమిలి, తోటవీధి, పురుషోత్తపురం, పెందుర్తి, లంకెలపాలెం, గిరిజాకాలనీ, ములగాడ, ఇందిరానగర్, కప్పరాడ, కొబ్బరితోట-1, లాసన్స్‌బే కాలనీ, పీఎం పాలెం(రామాలయం), ఎఎస్ఆర్ లేఅవుట్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. వైద్య సేవల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం స్వతంత్ర నగర్-1, సాగర్‌నగర్-2, పాత వెంకోజీపాలెం, రంగిరాజువీధి, జబ్బరితోట, నరసింహానగర్, నక్కవానిపాలెం, నమ్మిదొడ్డి, న్యూగాజువాక, చిన ముషిడివాడలో వైద్య శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,950
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,700
వెండి(కిలో):	రూ.77,400



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

ప్రమాదాలపై పారాహుషార్!

• ఎంపిక చేసిన ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ
• ప్రమాదాల నివారణకు నిపుణుల మెలకువలు
• ప్రయాణికులతో సత్ప్రవర్తనపైన అవగాహన
• ఉత్తమ డ్రైవర్లకు వచ్చే నెల 14న అవార్డులు



శిక్షణ పొందుతున్న డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఏటా జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తారు. ఏపీఎస్ఆర్టీసీ లోనూ రోడ్డు భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులోభాగంగా ఎక్కువ ప్రమాదాలు ఏ డిపోలో, ఏ డ్రైవర్లు చేస్తున్నారో తెలుసుకుంటున్నారు. ఆర్టీసీ జోన్-1 పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని 45 మంది డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జోన్-1 ఆపరేషన్ అండ్ కమర్షియల్ డిప్యూటీ సీటీఎం బలిజి అప్పలనాయుడు, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ (జెడ్‌ఎస్‌టీసీ) ప్రిన్సిపాల్ హిమబిందుల నేతృత్వంలో మొత్తం 18 డిపోలకు చెందిన వీరికి విజయనగరం జెడ్‌ఎస్‌టీసీలో ప్రమాదాల నివారణపై నిపుణులు సూచనలు ఇస్తున్నారు. బస్సు రివర్స్, సిగ్నల్స్ పాటించడం, రోడ్డు మార్జిన్లు, కారిడార్లను అంచనా వేయడం, జంక్షన్లలో అప్రమత్తత, వేగ నియంత్రణ తదితర అంశాలపై మెలకువలు చెబుతున్నారు. అలాగే ఈ జోన్ పరిధిలో తరచూ యాక్సిడెంట్లు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడకు తీసుకెళ్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాలు, అందుకు కారణాలను వివరిస్తూ అలాంటి చోట్ల డ్రైవింగ్‌లో ఎలా వ్యవహరించాలో తెలియజేస్తున్నారు. ఆర్టీసీ బస్సు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు, పాదచారుల మరణాలే ఉంటున్నందున వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. బస్సును నడుపుతున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లలో మాట్లాడవద్దని, దానివల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని డ్రైవర్లకు గట్టిగా చెబుతున్నారు. అదే సమయంలో డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా, సత్ప్రవర్తనతో మెలగాలని సూచిస్తున్నారు.

మరిన్ని జాగ్రత్తలు

డ్రైవర్లతో పాటు బస్సుల కండిషను కూడా సరిగా ఉండేలా చూడాలని సంబంధిత సిబ్బందికి ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. బస్సుల బ్రేక్‌లు, లైటింగులు, వైపర్లు, అద్దాలు, ఫుట్‌బోర్డులు, అత్యవసర ద్వారం వంటివి కూడా తనిఖీ చేశాకే బస్సును పంపాలని స్పష్టం చేసింది. విధులకు హాజరయ్యే డ్రైవర్లు మద్యం సేవించి ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అలాగే డ్రైవర్లు, కండక్టర్లకు రెస్ట్ రూముల్లో తగిన సదుపాయాలుండేలా చూడాలని డిపో మేనేజర్లకు సూచించింది. కాగా డిపోలు, జిల్లాలు, జోన్ల వారీగా ఉత్తమ డ్రైవర్లను ఎంపిక చేసి వారికి అవార్డులను కూడా ఇవ్వనున్నారు.

రోజు వారీ ఇలా..

ఈనెల 16 నుంచి 18 వరకు రోడ్డు భద్రతపై శిక్షణ, 19-24 వరకు బస్సుల నిర్వహణ, 25-28 వరకు ఫ్యామిలీ కౌన్సెలింగ్, 29-31 వరకు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్, ఫిబ్రవరి 1-5 వరకు వైద్య పరీక్షలు, 6-19 వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, 10న రక్తదాన శిబిరాలు, 11-13 వరకు యాక్సిడెంట్లపై ఆడిట్, 14న అతిథులతో ఉత్తమ డ్రైవర్లకు అవార్డులతో సత్కరించాలని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని కారు



సూర్యప్రభ(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఓ వివాహితను కారు రూపంలో మృత్యువు కబళించింది. కనుమ రోజు ఆమె కుటుంబంలో విషాదం నెలకొంది. గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాలివీ.. కెకోటపాడు మండలం గొట్లాం గ్రామానికి చెందిన కొట్యాడ సూర్యప్రభ(41) షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తోంది. తోటి కార్మికులతో కలిసి నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోనే నివాసం ఉంటోంది. కాపుతుంగ్లాంలో నివాసం ఉంటున్న మెకానిక్ చెన్నకేశవతో పెద్ద కుమార్తె ఉమాదేవికి ఏడాది కిందట వివాహం చేసింది. కాగా.. మంగళవారం రాత్రి సూర్యప్రభ, కుమార్తె, అల్లుడు ద్విచక్రవాహనంపై శ్రీనగర్‌లోని డీమార్ట్‌కు వెళ్లి సామాన్లు కొన్నారు. తిరిగి కాపుతుంగ్లాంలోని చెన్నకేశవ ఇంటికి వస్తున్నారు. వీరు సరిగ్గా లంకా మైదానం ఎదురుగా వచ్చే సరికి అగనంపూడి నుంచి పాతగాజువాక వైపు వస్తున్న గుర్తు తెలియని కారు వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో వెనుక కూర్చొన్న సూర్యప్రభ రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయాలవ్వడంతో వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యప్రభ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో ఉమాదేవి తలకు గాయాలయ్యాయి. చెన్నకేశవ్‌కు స్వల్పగాయాలయ్యాయని సీఐ తెలిపారు. మృతురాలికి వివాహం కావాల్సిన కుమార్తె, భర్త సన్యాసిరావు ఉన్నారు. సన్యాసిరావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీఐ సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారెవ్వా ఏమి పోజు!

ద్విచక్ర వాహనాన్ని మీరే కాదు.. నేను నడుపుతా అన్నట్టు ఎంత స్టైల్‌గా కూర్చుందో చూడండి ఈ శునకం. దాని యజమాని స్కూటీని నడుపుతుంటే.. ముందు హ్యాండిల్‌పై రెండు కాళ్లు పెట్టుకొని దర్జాగా పోజులు కొడుతోంది. వెళ్లి పోయే వారిని చూసుకుంటూ.. దర్పాన్ని ప్రదర్శిస్తున్న శునకాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఈఎన్‌సీలో డిఫెన్స్ విద్యార్థుల సందడి



నేవీ పనితీరును డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ విద్యార్థులకు వివరిస్తున్న ఈఎన్‌సీ అధికారులు

సింధియా: తమిళనాడు రాష్ట్రం వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ విద్యార్థులు, స్టాఫ్ తూర్పు నావికాదళంలో పర్యటిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన ఇక్కడకు చేరుకున్న వీరు 19వ తేదీ వరకు పర్యటిస్తారు. వీరికి సంస్థ పనితీరును నేవీ అధికారులు సమగ్రంగా వివరిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కవరత్తిలో వీరు ప్రయాణించారు. వివిధ జలాంతర్గాములు, ఎయిర్‌స్టేషన్, నేవల్ డాక్‌యార్డ్‌లోని భారత నావికాదళ విభాగాలను సందర్శించారు.

నేడు ఎన్నికల జాబితా పరిశీలకుడు రాక

మహారాణిపేట: ఎన్నికల జాబితా పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు కలెక్టరేట్‌లో ఈఆర్వోలు, ఇతర అధికారులతో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించనున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు.

77 ఏళ్ల జ్ఞానాన్వేషి

• ఏడు పదుల వయసులో న్యాయశాస్త్ర డాక్టరేట్
• మూడు యూజీ డిగ్రీలు, 10 పీజీ డిగ్రీలు, రెండు పీజీ డిప్లమోలు
• విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఆనందరావు జ్ఞానప్రయాణం



న్యాయశాస్త్రంలో డాక్టరేట్ అందుకుంటున్న ఆనందరావు(ఫైల్)

ఏయూక్యాంపస్: మన చుట్టూ ఉండే పరిసరాలు మన ఆలోచనలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. స్నేహితులు, సన్నిహితులు చెప్పే మాటలు ఒక్కోసారి మన గమ్యాన్ని మార్చేస్తాయి. స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగిగా పని చేసిన కస్తూరి వెంకట ఆనందరావు ప్రయాణం ఇదే విధంగా సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఎస్‌బీఐలో పని చేస్తున్న సమయంలో ఇక్కడి ఆచార్యుల సాంగత్యం, వారి మాటలు ఆయన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. మధ్యలో ఆపేసిన జ్ఞానతృష్ణను తీర్చుకునే దిశగా అడుగులు వేయించాయి.

ఏయూ పరిధిలో బీకాం పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగిగా స్థిరపడిన కస్తూరి వెంకట ఆనందరరావు తర్వాత కాలంలో అనేక ప్రాంతాల్లో ఉద్యోగం చేశారు. ఎస్‌బీఐ ఏయూ శాఖలో పనిచేసిన సందర్భంలో ఇక్కడ ఆచార్యులతో మాట్లాడటం, వారితో వివిధ అంశాలపై చర్చించడంతో ఆయనలో కొత్త ఆలోచనలకు బీజం పడింది. ఆ సమయంలోనే న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రామారావు సాయంత్రం కాలేజీలో బి.ఎల్ చేరాలని ఆనందరావును సూచించారు. అంతే.. తర్వాత సంవత్సరం ప్రవేశ పరీక్ష రాశారు. ర్యాంకు సాధించి, ఈవెనింగ్ కళాశాలలో లా పూర్తి చేశారు. అలా ప్రారంభమైన జ్ఞాన ప్రయాణం నేడు 10 పీజీ డిగ్రీలు, రెండు పీజీ డిప్లమోలు, న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ వరకు సాగింది.

అన్నింట్లోనూ ఫస్టే..

ప్రస్తుతం ఆనందరావు వయసు 77 ఏళ్లు. బ్యాంకులో వివిధ స్థానాల్లో 41 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి పదవీ విరమణ చేశారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఎల్.ఎల్.బి, బి.ఎల్.ఐ.సి, ఎల్.ఎల్.ఎం, ఎంఏలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఫిలాసఫీ, రూరల్ డెవలప్‌మెంట్, సంస్కృతం, జ్యోతిష్యం, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, సైకాలజీ, థియేటర్ ఆర్ట్స్ కోర్సులను పూర్తి చేశారు. వీటిలో పాటు నల్సార్ యూనివర్సిటీ నుంచి ఐ.సి.ఎ.డి.ఆర్ కోర్సు, ఏయూ నుంచి పి.జి.డి.టి.ఏ డైరెక్షన్ కోర్సులను సైతం పూర్తి చేశారు. డైరెక్షన్ కోర్సులో 2014 సంవత్సరానికి బంగారు పతకం, ఇటీవల జరిగిన ఏయూ స్నాతకోత్సవంలో న్యాయశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. త్వరలో డి.లిట్‌కు దరఖాస్తు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. అతను చదివిన ప్రతీ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం విశేషం.

నాటక రంగంతో అనుబంధం

చిన్నతనం నుంచి ఆనందరరావుకు నాటకరంగంపై అమితాసక్తి ఉంది. ఉద్యోగిగా ఉన్నప్పటికీ పరిషత్ నాటకాల్లో ఆయన తనదైన ప్రతిభను చాటారు. ప్రముఖ కళాకారులు మిశ్రో, వంకాయల సత్యనారాయణ తదితరులతో పలు నాటికలు, నాటకాలు ప్రదర్శించారు. తునిలో పనిచేసిన సమయంలో 12 ఏళ్ల పాటు నటరాజ ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ సమర్థవంతంగా నిర్వహించారు. ఆయనకు గాలివాన, వలయం నాటకాలు, కొడుకుపుట్టాలి, జారుడుమెట్లు, ఓటున్నబాబుకి కోటి దండాలు నాటికలు మంచి పేరు తెచ్చాయి. ఆలిండియా రేడియోలో పలు నాటకాలు రికార్డు చేసి ప్రసారం చేశారు.

అలా నెరవేరిన ఆకాంక్ష

చిన్నతనం నుంచి చదువుపై పుస్తకాలు, జ్ఞానాన్ని పొందాలనే తపన ఉండేది. అదే నన్ను ఈ దిశగా నడిపించింది. ఉద్యోగం చేస్తూ మంచి వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. ఏయూలో పనిచేసిన కాలంలో ఇక్కడ పరిసరాలు, ఆచార్యుల సూచనలతో ఉన్నత విద్య చదవాలనే ఆకాంక్షను నెరవేర్చుకున్నాను. ఒక్కో కోర్సును చదవడం వల్ల ఒక్కో కొత్త విషయాన్ని నేర్చుకున్నారు. అవి జీవితానికి ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి.

– కె.వి.ఆనందరావు

కేజీహెచ్‌లో డిజిటలైజేషన్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్‌లో డిజిటలైజేషన్ ల్యాబ్ ప్రారంభమైంది. ఆస్పత్రిలోని రాజేంద్రవార్డు, భావనగర్ వార్డు, సీఎస్సార్ బ్లాక్‌ల్లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలకు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.40 లక్షలతో ఈ ల్యాబ్‌ను సిద్ధం చేశారు. ఈ ల్యాబ్ ద్వారా రక్త పరీక్షల రిపోర్ట్స్ ఆన్‌లైన్‌లో పొందవచ్చు. వాటిని వైద్యులకు చూపించి.. చికిత్స చేయించుకోవచ్చు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, ఆర్ఎంవో, నర్సింగ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

వణుకుతున్న మన్యం



పాడేరులో చలిమంట కాగుతున్న ప్రజలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు అధికంగా ఉన్నాయి. మంచు కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. బుధవారం పాడేరు ప్రాంతంలో మంచు ప్రభావం తక్కువగా కనిపించింది. అరకులోయ, మినుములూరు కేంద్ర కాఫీబోర్డు కార్యాలయాల ఆవరణలో 13 డిగ్రీలు, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 16డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఐదు గంటల నుంచే చలిగాలులు విజృంభించాయి. ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు.

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది



అప్పన్న ఆలయంలో పెట్రోలియం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రమేష్, సభ్యులు

• పెట్రోలియం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రమేష్
• సింహగిరిపై స్వచ్ఛ తీర్థ నిర్వహించిన కమిటీ సభ్యులు

సింహాచలం: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని పెట్రోలియం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రమేష్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం పెట్రోలియం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ దర్శించుకుంది. కమిటీ చైర్మన్ రమేష్‌తో పాటు సభ్యులు ఎం.కె.రాఘవన్, రవిచంద్ర, దొద్దమల్‌నాగర్, కంట కర్దం, నారంబై కచ్చాడియ, చింతా అనురాధ, మిత్లేష్ కుమార్ తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా చుట్టూ ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అష్టోత్తరంపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికలను, శేషవస్త్రాలను ఈవో అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ మనదంతా వసుధైక కుటుంబమని తెలిపారు. విశాఖపట్నం రిఫైనరీ ప్రపంచంలోనే రెండో అతిపెద్దదని పేర్కొన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో స్వచ్ఛ తీర్థ నిర్వహించాలని పిలుపునివ్వడంతో కమిటీ సభ్యులు రాజగోపురం ఎదురుగా స్వచ్ఛతీర్థ నిర్వహించారు. చీపుర్లు పట్టుకుని శుభ్రం చేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

మురిసిన పర్యాటకం



చెరువులవేనంలో మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



వంజంగి కొండకు తరలివచ్చిన సందర్శకులు

• వంజంగి హిల్స్, చెరువులవేనంకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
• ప్రకృతి అందాలు తిలకిస్తూ సందడి

సాక్షి, పాడేరు/చింతపల్లి రూరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, చింతపల్లి మండలంలోని చెరువుల వేనంకు భారీగా పర్యాటకులు తరలివస్తున్నారు. వేకువజామున అక్కడికి చేరుకుని సూర్యోదయం, మంచు అందాలను తిలకించి మధురానుభూతి పొందుతున్నారు.